# జైనుల మతకథలు

## ౬. సంజయంతముని-సత్తపోద్ద్యోతినీ కథ

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారు

*శ్లో. జాతి ర్జరా మరణ మిత్యనలత్రయస్య, జీవాశ్రితస్య బహుతాపకృతో యథావత్;
విధ్యాపనాయ జినపాదయుగాగ్రభూమౌ, ధారాత్రయం ప్రవరవారికృతం క్షిపామి.

[ఆచార్యపంచవింశతి]

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో భారతవర్షాన్ని మించింది లేదు. అందులోనూ మేరుపర్వత సమీపదేశాలు అతిపవిత్ర మైనవని ప్రసిద్ధి. మేరుపర్వతపు పశ్చిమభాగంలో విదేహదేశం అంటే-తత్రాపి ముఖ్యం. విదేహవాసులు పెట్టిందే వేదాంతాలలో భిక్ష అయింది బహుకాలంనుండి. ఇటువంటి విదేహదేశంలో గంధమాలిని దగ్గర వీతశోకపురం అని మనకథాకాలంలో వొకపట్నం వున్నది. దాన్ని పాలించేరాజు భవ్యశ్రీ అనేవాడు. భవ్యశ్రీ పరమార్థంలో నిజంగాగూడా భవ్యశ్రీయే! ఆయన ఆధ్యాత్మికనిరతి అమోఘమైంది. అంతటి విజ్ఞాని మరి లేడన్నా తప్పులేదు. భవ్యశ్రీ-విజ్ఞానీ అంటే- కుమ్మరపురుసనత్. భవ్యశ్రీకి సంజయంతుడనీ, జయంతుడనీ ఇద్దరు కొమాళ్లున్నారు. ఇద్దరూ మంచివాళ్లే. అంటే, కాళ్లు చేతులూ, కళ్లూముక్కూ అందంగా వున్నా యన్నమాట కాదు. మరేమంటే గుణవంతులూ జ్ఞానవంతులూ అన్నమాట.

ఇట్లా వుండగా వొకనాడు మంచి చిత్రం జరిగింది. మండువేసవికాలం; అది రాత్రిపూట. భవ్యశ్రీ చల్లగాలికి మేడపైని ఒంటరిగా కూర్చున్నాడు. అసలే జ్ఞాని అయిపోయె. అందులో ఆనాడు ప్రపంచపు అస్థిరత్వాన్ని గూర్చి తలపోస్తూ కూచున్నాడు. చాలా ప్రొద్దుపోయింది. కాని అంతవరకూ నిర్మలంగా వున్న ఆకాశంలో ఒకక్షణంలో మబ్బు కమ్మింది. ఒకనిముషం చల్లటిగాలి వీచింది. తర్వాత వెంటనే టపటప మని చినుకులు ఆరంభమైనవి. ఇంతలో రాజుగారి హవాలాలోని పట్టపేనుగ కట్లు తెంచుకొని వీథిని బడ్డది. రాజుగారిదంతా చిత్రంలాగా చూస్తూ వున్నాడు. ఆవుత్తరక్షణంలోనే బడబడామని ఉరుము వకటి ఉరిమింది. ఆవురుముతో పెద్దపిడుగ ఆకర్షించి వచ్చి రాజుగారి పట్టపేనుగుమీద బడ్డది. ఏనుగు చచ్చింది. దీనితో పిడుగుకథ ముగిసింది. కాని భవ్యశ్రీ మనస్సులో మాత్రం పిడుగుల వర్షం వర్షిస్తూనే ఉన్నది.

"అన్నన్నా!—ఏమి సంఘటనం—!! ఏమి కాలము!!! ఎక్కడి వర్షం? పిడుగెక్కడ వచ్చింది? కుశించి కూర్చున్న ఏనుగ పీకిని పడడ మేమి? కన్నుమూసి తెరిచేంతలో ఈచావడం ఏమి?—" అని ఇట్లా ఏమేమో తర్కాలు ఆరంభమైనవి రాజు మనస్సులో. ఇక

---

* ఎప్పుడూ ఈప్రపంచంలోని జీవులయొక్క శరీరాలను ఆశ్రయించి, అత్యధికముగ సంతాపమునుగూర్చుస్తూ వున్న జాతి-జర(ముసలితనము)-మరణము అనే మూడు అగ్నులను చల్లారి రూపుమాపి పోవుటకై శ్రీజినదేవుని పాదారవిందముల సన్నిధియందు ప్రవరోదకములతోనైన ధారలను (సంద్యోదకములను) ముమ్మారు చల్లుచున్నాను. అనగా జినసాన్నిధ్యమున నేనిచ్చు ఈమున్నూరు లక్ష్యములన్నా ముత్తెరగులైన (జాతిజరామరణములనే) జీ సంతాపములను పోకార్చుగాక యనుట.

ఆతర్వాత—లను అంతూ లేదు పొంతూ లేదు. ఒకటే ఆలోచన—ఒకటే అనిత్యత్వస్ఫురణాలు—ఒకటే వైరాగ్యవిచారణాలు!

ఈవిధంగా భవ్యశ్రీ తలకిందులవుతున్నాడు. అంతకంతకూ ప్రపంచంమీద రోత విజృంభిస్తున్నది. ఇంతలో భల్లున తెల్లవారింది. భవ్యశ్రీ మాఱుమాట లేకుండా లేచి నిత్యకృత్యాలు తీర్చుకొనడానికి వెళ్లేడు.

"నిన్న రాత్రినుండి మహారాజుగారు శయనాగారమునకు రాలేదు. కారణమే" మని భవ్యశ్రీభార్య సంజయంతజయంతులకు కబురు చేసింది. సంజయంతజయంతులు రాజుగారిని వెదకివెదకి స్నానశాలలో కనుగొన్నారు. అతినిర్భేయతతో ఆయననిర్విణ్ణభావాన్ని ఆశంకిస్తూ "జరిగినదే"మని—విచారణ చేసినారు. రాజుగారన్నారు గదా!—"నాయనలారా! నాకీ ప్రపంచముపైని గల ఇచ్ఛలు నష్టమై పోయింది. ఎన్నాళ్లు బ్రదికినా—ఎప్పుడో వకనాడు—పట్టణేనుగువలె మరణించవలసిందే గదా! కాబట్టి—ఈబంధమయమైన—అస్థిర ప్రపంచంతో—నాకింక ప్రయోజనం బొత్తుగా కనపడడం లేదు. నేను ఎల్లాగైనా ఇకమీద అడవులకు పోయి, తపశ్చర్యద్వారా ముక్తుణ్ణి కాగోరుతున్నాను; "కాగోరుతున్నా" నన్నమాత్రాన అవుతావా? అని అడగవద్దు. తప్పకుండా ముక్తుణ్ణి అవుతాను. పెద్దలు చెప్పలేదా?—

శ్లో. బద్ధం పశ్యన్ బద్ధో
ముక్తం ముక్తో భవేత్సదాత్మానమ్;
యాతి యదీయేన పథా
తదేవ పుర మశ్నుతే పాంథః.—అని

[జీవుడు తన్ను బద్ధుణ్ణిగా భావిస్తే బద్ధుడే అవుతాడు. ముక్తుణ్ణిగా భావిస్తే ముక్తుడే అవుతాడు. ఏమంటే త్రోవ నడిచేప్పుడు—ఏపట్నంమార్గాన్ని అనుసరిస్తే ఆపట్నానికే చేరడముంది గాని ఇంకోపట్నానికి చేరుతాడా?—అనిభావం]

కాబట్టి నేను ముక్తుణ్ణి కాగోరుతున్నాను. నాకీ బంధహేతువైన సంసారంతోనూ, రాజ్యంతోనూ పనేముందీ? మీరిద్దరూ బుద్ధిమంతులూ, కాగలవాళ్లూ. మీరీ రాజ్యభారం వహించి ప్రజాశ్రేయమునకు పాటుపడండి. మిమ్మిద్దలను రాజ్యానికి పట్టాభిషేకం చేస్తాను.—అని.

తండ్రిచెప్పిన మాటలు ఆకొడుకులకు నచ్చలేదు. వారన్నారు గదా—"నాన్నా! మీరు, స్వయంగానే జితేంద్రియులు, ముక్తులు కదా! అట్టి మీకే ప్రపంచం అస్థిరమని తోచినప్పుడూ—దాన్ని పంతిత్వరలో విడిచిపెడితే అంతమంచిదని తోచినప్పుడూ—మాకు మాత్రం—ఈబంధాన్ని మెడ కేల వేయవలయును?—ఆప్తులు హితులగు పెద్దలు అనుశాస్యులకు హిత ముపదేశింతురే కాని అహితమును చెప్పెదరా? లోకకల్యాణమును కోరు భిషక్కు—లు గదవినాశము చేయ యత్నింపవలెనే కాని గదప్రకోపకార్యములలో జతలనూ పందవతులనూ నియోగించతగునా? విష మెప్పుడూ విషమే అవుతుంది గాని కొంతటి కది యమృతాయమాన మగునా? కాబట్టి మాకున్నూ ఈప్రపంచంతో ఏమాత్రం నిమిత్తం లేదు. మేమున్నూ మీతోపాటు తపశ్చర్యకే వస్తాము—" అని. భవ్యశ్రీకి ఏమి చెయ్యడానికీ తోచలేదు. కొడుకులు చెప్పేమాటలు మంచివే. కాని తానా విరక్తుడు. ఇన్నాళ్లదాకా పాలించినరాష్ట్రాన్ని అనాథగా చెయ్యడం అసలే యుక్తంగా లేదు. కాబట్టి ఆయన సరేనని సంజయంతునికొడుకు వైజయంతుడనేవాడికి రాజ్యాభిషేకం చేసి ఇద్దరు కొడుకులతో బయలుదేరి అడవులకు తపశ్చర్యకై వెళ్లినాడు. అచ్చట భవ్యశ్రీ అత్యుత్కటమైన, తపస్సుచేసి ఘాతికర్మను తుదముట్టించి కేవలశ్రీలో ఐక్యమై పోయినాడు. ఇక మిగిలింది సంజయంతజయంతు లిద్దరున్నారు. ఆతర్వాత అందులో జయంతుడు తండ్రికి లభించిన దేవపదవికి సంతోషించి తానున్నూ ఉత్కటమైన యోగం అవలంబించి ధరణేంద్రత్వాన్ని పొందాడు. తర్వాత సంజయంతుడు మునియై పక్షోపవాసాలు మాసోపవాసాలు మొదలైన నియమాలతో—శరీరాన్ని కృశింపజేస్తూ—క్షుత్పిపాసాలను లక్ష్యం చెయ్యకుండా, నిశ్చలత్వంతో తపస్సు చేస్తున్నాడు. ఆయన్ని సుఖదుఃఖాలు గానీ—శీతోష్ణాలు గానీ—మఱి ఇతరద్వంద్వాలు గానీ బాధించడం లేదు. ఏమంటారా?—మునుల స్థితే అలాంటిది. చెప్పలేదా మఱి!—

శ్లో. ప్రబోధో నీరంధ్రం
ప్రవహణ మమందం పృథు తపః

సుహాయు ర్ధైర్యః ప్రాప్తో
గురుగణసహాయాః ప్రణయినః;
కియన్మాత్ర స్తేషాం
భవజలధి రేషోఽస్య చ పరః
కియద్దూరే పారః
స్ఫురతి మహతా ముద్యమవతామ్.
—ఆచార్యరత్నశ్రావకులు.

[దట్టమై చాలినంత విజ్ఞానము; కావలసినంత దృఢమైన తపస్సు; సుఖాన్ని అనుభవించితనియడానికి చక్కని చల్లని మెల్లని గాలి వలసినంత. లేళ్లు మొదలగు సాధుజంతువులే మాకు ప్రేమచూపువారు; గురుస్థానమునుండి సాయము చేయువారు. అని ఈ విధంగా శాంతములైన పరిస్థితులలో వర్తించు మహాత్ములకు సంసారసముద్రం ఎంతటిది? అట్టి యుద్యమశీలురగు పెద్దలకు- కండ్లయెదుటనే సంసారపు ఆవలిగట్టు కనిపిస్తూంటుంది గదా!- అని భావం.]

ఇట్లా వుండగా- వకమాటు- సంజయంతుడు యోగధారణ చేసి- బండలాగా కదలక మెదలక- భగ్గుమనే నడిఎండలో తపస్సు చేయ నారంభించాడు. ఆయన ధారణచేత పైనిపోయ్యే పక్షులుకూడా స్తంభించిపోతున్నవి. కాని ఎవ్వరికీ హానిమాత్రం కలగడంలేదు. ఈ స్థితిలో విద్యుద్దంష్ట్రుడనే పక్షిరాజు (ఈయన గంధర్వుని శేష మట!) విమానమెక్కి- ఆ మార్గంగుండా బయలుదేరి పోతున్నాడు. అంతవఱకూ- వాయువేగాల మనోవేగాలతో పోతూవున్న ఆ విమానం- సంజయంతముని ఉన్న స్థలంపైకి వచ్చేసరికి- స్తంభించింది. విద్యుద్దంష్ట్రుడెన్నివిధాలో పాట్లు పడ్డాడు. ఏమైనా కదలలేదు. చివఱకు- విమానంలోనుండి క్రిందికి దిగి చూచేసరికి- సంజయంతముని కనపడ్డాడు. "ఆఁ తెలిసింది. ఇదంతా ఈదుర్మార్గుడు చేసిన తంత్రమే-" అనుకున్నాడు. కాని సంజయంతుడికి ఈ దురుద్దేశం ఏమాత్రమూ లేదు. ఆయన ఐహికమును త్యజించిన విరాగి. అందులోకూడా ఆచార్యకుందకుందుడు చెప్పినట్లుగా—

శ్లో. వయ మిహ నిజయూథభ్రష్టసారంగకల్పాః
పరపరిచయభీతాః క్వాపి కించి చ్చరామః;
విజన మధివసామో న వ్రజామః ప్రమాదం
సుకృత మనుభవామో యత్ర కు త్రోపవిష్టాః.

[అనఁగా- మేము (అనగా విరక్తులమై సంసారసుఖముల వీడి కేవల మడవులలో ముక్కుమూసికొని కాలక్షేపము చేస్తూవున్న మునివ్రతులము) తమ జాతి మందలోనుండి తప్పిపోయిన లేళ్లతో సమానులం. అవి న్నీ మేమున్నూ పరుల సంసర్గమన్న భయపడుతాం. ఇతరుల కంటబడకుండ మే ముభయులమూ ఎక్కడో మారుమూల ఒదిగి తిరుగుతాము. నిర్జనప్రదేశములలో వసిస్తాము. ఎప్పుడూ ఏవిధమైన ప్రమాదానికీ కూడ పాల్పడం. ఏదో వకచోట గూర్చుండి మాచేసినసుకృతమేదైనా వుంటే అనుభవిస్తాం. లేకుంటే లేదు అని తాత్పర్యము.]

అను ఆదర్శం పెట్టుకొన్నాడు. ఏమైతే నేం- ఈ విషయం విద్యుద్దంష్ట్రుడిలాంటి దుష్టులమనస్సుకు తోస్తుందా? కాబట్టి అతను ఏంచేశాడంటే- తన విద్యాబలంచేత అతనిపైని ఉత్సర్గవిధిని ప్రయోగించాడు. అయినాకానీ సంజయంతముని కదలా లేదు, మెదలా లేదు. అవును మఱి:—

శ్లో. బిభీషికాశతేనాపి మత్తదంతీ చలే త్కిము?
మహావాయుశతై శ్చాపి చాల్యతే కిం సురాచలః?

[బిభీషికలనగా పిల్లలు మొదలైనవారిని బెదిరించేందుకు చేసే జడిపింపులు. వందలకొద్దీ బిభీషికలు చేసినా మదపుటేనుగు కదలుతుందా? పేద్ధపేద్ధ వాయువులు ఎన్నివీచినా మందరపర్వతం కదులుతుందా?- అనగా కదల దని తాత్పర్యము.]

తర్వాత విద్యుద్దంష్ట్రుడింకోయుక్తి చేశాడు. తన విమానాన్ని దిగి వెంటనే ఆసంజయంతుణ్ణి తనవిద్యాబలంతో ఎత్తికొని విమానంలో పెట్టుకొనిపోయి భారతవర్షము తూర్పుప్రాంతాలవుండే సింహవతీనదీసంగంలో (రెండుమూడునదులు కలిసే కూడలికి సంగం అని పేరు.) క్రింద విడిచిపెట్టాడు. మంచో చెడ్డో అంతతో పోనిచ్చినా? అట్లా కాకుండా, ఆదీవిలో వుండే పామరులను ప్రోగుచేసి, వాళ్లతో—"వీడో రాక్షసుడు! చూశారా? ఇట్లా- కళ్లు మూస్తూ తెరుస్తూ వుండి- మను

ష్యులను పట్టి చంపి మ్రింగుతాడు. మానగరంలో ఇట్లా చేస్తూంటే ఇతన్ని ఇక్కడికి తెచ్చి పడవేశాను. మీరు వుపేక్షచేస్తిరా? ఇక మీప్రాణాలు దక్కవు. కాబట్టి వెంటనే ఇతన్ని చంపివేయండి-" అని గట్టిగా చెప్పి వెళ్లాడు. అసలే ఆద్వీపవాసులు చాలా మూర్ఖులు. అందులో- ఇల్లాంటిభయం కూడా కల్గింతర్వాత- ఇక చెప్పే దేముందీ?- అంతట వాళ్లంతా కఱ్ఱలూ గట్రా తీసికోని ఒక్కమాటుగా-ఆయనపైని బడి చంపివేశారు. దుష్టసాంగత్యమే అట్లాంటిదీ!- కాబట్టే;

శ్లో. స్నిగ్ధైరపి వ్రజత మా సహసంగ మేభిః
క్షుద్రైః కదాచిదపి; పశ్యత సర్షపాణామ్
స్నేహోఽపి సంగతికృతః ఖలతాశ్రితానాం
లోకస్య పాతయతి నిశ్చిత మశ్రుధారామ్.

[ఎంత స్నేహితులుగా వున్నా [స్నేహితులు =మిత్రులు: స్నేహం- (అనగా తైలం-) కలవి;] క్షుద్రులతో ఎప్పుడూ స్నేహం చేయ్యరాదు. చూడండి- ఆవాలు ఉన్నవి. ఇవి స్నేహం కలవైనా ఖలత్వాశ్రితాలుగనుకా [రోటిని ఆశ్రయించి రసము తీయబడినవిన్నీ, దుర్జనసాంగత్యం కలవాళ్లున్నూ కాబట్టి] తమదరిని జేరిన లోకులకు కన్నీళ్లు కారజేయుచున్నవి. అనగా దుఃఖాలపాలు చేయు నని యర్థము.]

అన్నారు పెద్దలు. తర్వాత ఈసంగతి క్రమంగా ధరణేంద్రుడికి (దేవత్వంలో వున్న జయంతుడికి) తెలిసింది. ధరణేంద్రుడు వెంటనే కోపంతో సింహవతీ సంగమం దగ్గఱికివచ్చి అచ్చటి ప్రజల్నందర్నీ నాగపాశంతో బంధించి చంపడానికి పూనుకొన్నాడు. వాళ్లందరూ అతని కాళ్లమీద బడి జరిగిన సంగతి యావత్తూ అతనితో చెప్పి- మహాప్రభూ! క్షుద్రులం. మా క్షేమం పరాయిల క్షేమం తెలిసికోజాలని బుద్ధిహీనులం. అయినా ఇదంతా ఆ దురాత్ముడు విద్యుద్దంష్ట్రుడు చేసిన ఘోరం. కాబట్టి శిక్ష అతనికి చెయ్యవలెనని- ప్రార్థించారు. సరేనని ధరణేంద్రుడు వాణ్ణి పట్టుకొని నాగపాశంతో బంధించి సముద్రంలో త్రొక్కి- చంపేస్తావని బయలుదేరాడు. ఇంతలో దివాకరుడనే మహాముని వచ్చి అన్నాడు:—నాయనా! ధరణేంద్రా!- బుద్ధిమంతుడివిన్నీ సిద్ధిమంతుడివిన్నీ కదా నీవు. ఈ క్షుద్రుణ్ణిపట్టి చంపబూనేవేం? ఇప్పటికి నాల్గుజన్మాల నుండీ కూడా-వీడు చచ్చినవాడితో తుల్యమే! చచ్చినవాణ్ణి మళ్లా చంపడమటయ్యా?-ఎబ్బే!- నీవంటి దివ్యుడికి ఇది తగినపని ఎంతమాత్రమూ కాదు. ఇంతటనైనా నీ పదవికీ- ప్రాభవానికీ - తగినట్లుగా వర్తిస్తే బాగుంటుంది- అని. ధరణేంద్రుడికి కోపం పోయింది. కాని నాల్గుజన్మాల శత్రుత్వ మెట్లా? అని సందేహం కలిగింది. వెంటనే ధరణేంద్రుడా మునికాళ్లపైబడి వేడుకొన్నాడు—"ప్రభూ! వీడికీ మాకూ నాల్గుజన్మాల నుండీ విరోధ మన్నారే!- అది ఎట్టిదో చెప్పవలెను.-" అని ముని చెప్పడం ఆరంభించాడు.

'నాయనా! చెబుతా విను. § పూర్వం సింహపురంలో సింహసేను డనే రాజుండేవాడు. ఆయనకు రామదత్త యనే భార్యయున్నూ శ్రీభూతిఅనే పురోహితుడూ ఉండేవాళ్లు. ఒకమారు పద్మఖండవాసియైన సముద్రదత్తుడు వాణిజ్యమునకు పోతూ శ్రీభూతి దగ్గఱ తన రత్నాలను దాచిపెట్టుకొన్నాడు. కొన్నాళ్లయినతర్వాత మఱల వచ్చి రత్నాలడిగితే శ్రీభూతి తనకు తెలియదన్నాడు. పిమ్మట రామదత్తాదేవి యుక్తిగా రత్నాలు బైలుపెట్టించింది. సింహసేనుడు శ్రీభూతిమీద మండిపడి ఆరత్నాలను లాక్కొని సముద్రదత్తుడి కిప్పించడమేకాకుండా, ధర్మాధికారులయెదుట సభదీరి— ఆసభలో- నానావిధాలా అవమానంచేసి, జెట్టీలచే 30 దెబ్బలు కొట్టించునట్లు శిక్ష విధించాడు. శ్రీభూతి దెబ్బలుతినలేకపోగా- మూడుపళ్లేల గోమయం తినిపించాడు. శ్రీభూతి 'చావుతప్పి' కన్ను సొట్టబోయి ఎల్లాగో అప్పటికి నిబ్బరించుకొన్నా తర్వాత ఆదిగులుతో చచ్చాడు. మరణకాలంలో సముద్రదత్తుడిమీది శత్రుత్వం మనస్సులోనే పెట్టుకొని చచ్చినాడు. పిమ్మట సముద్రదత్తుడు ధర్మాచార్యులయొద్ద జైనదీక్ష తీసికొని కొన్నాళ్లకు మరణించి ఆ సింహసేనుడికే కొడుకుగా పుట్టినాడు. శ్రీభూతి మరణకాలంలో శత్రుత్వం తలపోస్తూ ప్రాణాలు విడిచిపెట్టినందున ఆ

§ ఈకథ వెనుకటిసంచికలో ప్రకటితమైనది కావునదానిని చిత్తగింపగోరెదను. [పం. ఆ.]

సింహచంద్రుడి (ఇతడే సింహసేనుడి కొడుకు) కోశాగారంలో త్రాచుపామై పుట్టినాడు. కాని అతనికి జాతిస్మరత్వం పోలేదు; కాబట్టి ఒకనాడు సింహసేనుడు కోశాగారంలో తిరుగుతుండగా శ్రీభూతి సర్పము కఱవగా చచ్చినాడు. ఇది మొదటిజన్మంలో ఏర్పడ్డ విరోధం సుమా!'

ఇంక రెండోజన్మంలో వచ్చిన విరోధం చెబుతాను—విను. శ్రీభూతిచే కరవబడి చచ్చినతర్వాత సింహసేనుడు వింధ్యారణ్యంలో సల్లకీదుర్గంలో వక ఏనుగై పుట్టినాడు. తండ్రిమరణమునకై చాలా చింతించి సింహచంద్రుడు కోపంతో ఆథర్వణతంత్రం ప్రకారం సర్పయాగం వకటి తలపెట్టి ఉన్నసర్పాల నన్నీ తెప్పించి కాల్పించినాడు. అందులో శ్రీభూతిసర్పం కూడా చచ్చింది. కాని అంత్యకాలాన వైరంవదలిపెట్టకుండా చచ్చి-ఏదుర్గంలో సింహసేనుడు ఏనుగై పుట్టాడో- అదేదుర్గంలో- శ్రీభూతిసర్పంకూడా కర్కుటసర్పాకారంతో పుట్టింది. అయినా శత్రుభావన మాసిపోలేదు. తర్వాత వకనాడు రామదత్తాదేవి- గతాన్ని తలపోసికొని- విరక్తురాలై కనశ్రీ ఆనే ఆర్యికయొద్ద జైనదీక్షను గ్రహించి తపోపవాసాదులతో కాలక్షేపం చెయ్యడం ఆరంభించింది. సింహచంద్రుడుకూడా విరక్తి పొంది రాజ్యాన్ని అంతా తనతమ్ముడికి పూర్ణచంద్రుడికి ఇచ్చివేసి, తాను సద్గురువుయొద్ద దీక్షను గ్రహించి మునియైనాడు. క్రమంగా సింహచంద్రుడు చతుర్థజ్ఞానాధికారియైనాడు. రామదత్త అతనియొద్దకుపోయి "నాయనా! నేను చేసికొన్న పుణ్యంవల్ల మీలాంటి పుత్రరత్నాలు గల్గి- నన్ను తరింపజేశారు. కాని నీ తమ్ముడు పూర్ణచంద్రుడు ఎప్పుడు ఇట్లాంటి శుభము పొందుతాడో గదా!" అన్నది. అప్పుడు సింహచంద్రుడన్నాడు:—"అమ్మా!—వక రహస్యం ఉన్నది. దాన్ని నీకు ఇన్నిదినాలనుండీ చెప్పలేదు. ఇప్పుడు ప్రసక్తి వచ్చింది గనుక చెబుతున్నాను. సంసారంలో జీవుల సంసరణాలు చాలా చిత్రంగా వుంటవి. సింహసేన మహారాజుగారు నాడు ఆవిధంగా పాము కఱచినందుచేత మరణించారుగదా. తర్వాత ఏమైందంటే, ఆయన సల్లకీవనంలో ఏనుగుగా పుట్టాడు. ఒకనాడు ఆ ఏనుగు స్నానానికిపోతూన్న నన్ను చూచి చంపాలెనని పరుగెత్తుకొని వచ్చింది. నేను వకక్షణకాలంలో విషయం తెలిసికొన్నాను. తర్వాత నేనన్నాను:—నాయనా! నీవు ఏనుగవు కాదయ్యా; సింహసేన మహారాజువు; నాకు తండ్రివి. నేను నీకొడుకును. సింహచంద్రుణ్ణి కదా!—అనినేనిట్లాచెప్పేసరికిఆయేనుగకు జాతిస్మరత్వం కలిగింది. దానితో వివేకం కల్గింది. కాని వాగింద్రియం స్వాధీనంలేనిజంతువుకాబట్టి - ఏమిన్నీ చెప్పుకోడానికి వీలులేక- వకటేధారగా కన్నీళ్లు విడిచింది. నిజమేమంటే—చతుష్పదో దయనీయాః ఖలు సర్వదర్శినామ్.—[ఏమతంవారికైనా సరే పాపం నోరులేని జంతువులు జాలి చూపవలసినవేకదా] అని పెద్దలు చెప్పారు. నామట్టుకు నేనుకూడా ఒకక్షణం- ఆ వైక్లబ్యాన్ని ఆపుకోలేక అట్టే నిలవబడ్డాను.

తర్వాత నేనేంచేశానంటే: ఆయేనుగను దగ్గరికి తీసికొని చెవిలో జినధర్మశ్రవణం చేశాను. సమ్యక్త్వస్వరూపాన్నీ - అణువ్రత విధానాన్నీ - ఉపదేశించాను. ఉండడానికి చతుష్పాదజన్మలోవున్నా-జాతిస్మరణం గలిగింది కాబట్టి- ఆయేనుగకూడా-నా ఉపదేశానుసారంగా ఆనాటినుండీ జినవ్రతాలను అనుసరిస్తూ ఆహారమూ నీళ్లు మొదలైనవాటిలో నియమం అవలంబిస్తూ ఉన్నది.

ఇట్లావుండగా ఇంకోనాడు నదీతీరంలో నీళ్లను తాగడానికిపోయి- దైవవశమున- బురదలో దిగబడ్డది. ఎన్నోప్రయత్నాలు చేసినా ఆబురదలోనుండి తప్పించుకొని రాలేకపోయింది. చివఱకదే తనకు అంత్యదశగా నిర్ధారణచేసికొని, సమస్తపాపాలనూ పోగొట్టే శక్తిగల పంచనమస్కారమంత్రాన్ని జపిస్తూ ప్రాయోపవేశం చేసింది. దీనికిట్లా ఇట్లావుండగా శ్రీభూతి చరసర్పం ఏమైందంటే- తనపాపాలవల్ల తాను మరణించి- నాలుగో నరకంలో బడి, ఏ బురదమడుగులో సింహసేనమహారాజు ఏనుగుశరీరంతో ప్రాయోపవేశం చేశాడో-అదేమడుగులో-కర్కుటకనాగమై పుట్టిఉండడంచేత- కాళ్ళక్రిందజేరి దాన్ని ఎముకలుకొరికి భక్షించింది. బురదకు పైభాగంలో వున్న కళేబరాన్ని బోయవాడొకడు తీసికొనిపోయి ఏముకలు ఏరి

మనపట్నంలోనే కాపురంవుండే ధనమిత్రుడికి అమ్మి నాడు. అతను ఆదంతాలు తరిమెూపట్టించి మంచపు కోళ్లు సింహాసనపుపీటలూ చేయించి, మన పూర్ణ చంద్రుడికి అమ్మినాడు. కుంభస్థలంలోని ముత్యా లను కూడా మనవాడే కొని పూర్ణచంద్రుడు చాలా ఉత్తమవస్తు వని సంతోష పడుతున్నాడు. ఇంత యేల?- మన తమ్ముడు కూర్చున్న ఆ సింహాసనపుపీట దంతము లవియే. నీకోడలు వేసికొన్న ముత్యాలహారాలు అవే. కాబట్టి అమ్మా! జంతువుల సంసారగతు లిలావుంటే, మన ప్రయత్నాలు ఎందుకు కొర అవుతవి? ఇంత మా త్రమైనా తెలిసికోలేని మన పూర్ణచంద్రుడు ఎట్లా మునియై శుభాలు పొందుతాడూ!” అని.

రామదత్త ఈవృత్తాంతాన్నంతా విని గోలు గోలుమంటూ పూర్ణచంద్రుని వద్దికివెళ్లి జరిగినదంతా చెప్పింది. తర్వాత ఆయనకూడా సింహచంద్రుడి దగ్గ ఱకు వచ్చి-అజ్ఞానాన్ని-ప్రకటం చేస్తూ-ఏడవడం ఆరం భించాడు. పూర్ణచంద్రుడు వారిని ఎన్నోవిధాల ఓదా ర్చాడు. కాని లాభంలేకపోయింది. అప్పుడన్నాడుగదా:

శ్లో. ధురిధర్మాత్మకం తత్త్వం దుష్ప్రితేర్మంద బుద్ధయః,
జాత్యంధహస్తి రూపేణ జ్ఞాత్వా నశ్యంతి కేచన.
జంతు ముద్ధర తే ధర్మః సతతం జన్మసంకటే,
అన్యథాస కృతో భ్రాంత్యా లోకానశ్యంతిసంతతమ్.

[తమ కళ్లయెదుట- తాము ఆచరింపవలసిన ధర్మ తత్వము విస్పష్టంగా గోచరిస్తూన్నా మందమతులు, జా త్యంధులు ఏనుగు స్వరూపము తెలుంగక నశించేట్లు నశి స్తారు. కాబట్టి నిశ్చలబుద్ధితో మునిజనుల తోడ్పా టుతో ధర్మస్వరూప పరిజ్ఞానాన్ని పొంది వర్తించడం మంచిది. నీవు ధర్మమును ఆచరించవలసిన కాలంలో మోహాన్ని పొందుతున్నావు. ఇది తగదు. శోక మోహాల నుండి తరింపజేసేది ధర్మమే. ధర్మమే జన్మముల్లెత్తడం. అనేక సంకటాలనుండి ప్రాణికోటిని ఉద్ధరింపగలదు. ధాన్ని వదలి భ్రాంతికి గుఱియై లోకులు నశిస్తూ వున్నారు. ఎంత చిత్రం!—అని భావం.]

ఈ మాటలతో కర్తవ్యం కొంతవఱకు పూర్ణచం ద్రుడికి గోచరించింది. అయినా మోహపరీతుడు కాబట్టి వెంటనే ఆ దంతాలను పుష్పాదులతో పూజించి దహ నాదులగు సంస్కారాలను జరిపాడు. నిజమే-అన్నారు గదా పెద్దలు! ‘కిం నకుర్వంతి మోహినః’ మోహబుద్ధులు చేయని అవక తవక పనులంటూ వున్నవా?—అని. ఆ నాడుమొదలు పూర్ణచంద్రుడు జైనదీక్షను గ్రహించి క్రమంగా దేవత్వాన్ని పొందినాడు. రామదత్తాదేవి కూడా శుద్ధ తత్వాన్ని పొందింది. ఇది రెండో జన్మం లో ఏర్పడ్డ విరోధం సుమా!

మఱి మూడో జన్మంలోని విరోధం చెబుతాను విను;—ఈ జంబూద్వీపంలోనే గరుడాచలానికి దగ్గ ఱగా సూర్యపురం-అని వకపట్నం వుంది. దాన్ని పాలించే రాజు పేరు సురావర్తుడు. ఆయన భార్య పేరును బట్టేకాకుండా, దాన పూజాశీలాదుల బట్టికూడా యశో ధరే. ఆమె గర్భంలో సింహసేనుడి గజశరీరంలో నున్న నరాత్మ ప్రవేశించింది. తర్వాత కొన్నాళ్లకు గర్భమై మగపిల్లవాడు కలగ్గా రశ్మివేగుడని పేరు పెట్టారు.

రశ్మివేగుడు మంచి తేజస్సైనవాడు; ధర్మపరుడు; చక్కని జ్ఞానసంపదను ఆర్జించాడు. సురావర్తుడు బుద్ధి మంతుడైన కొడుక్కు- రాజ్యం వప్పజెప్పి అడవులకు వెళ్లిపోయినాడు. ధర్మస్థితేలేని ఈ కాలంలో ధర్మ తత్పరులైన బుద్ధిమంతులు తఱుచుగాగాని సంభవించరు. కాబట్టి అన్నారు పెద్దలు కూడాను. వారు చెప్పిం దేమంటే:—

శ్లో. నష్టం రత్న మివాంబుధౌ, నిధిరివ
ప్రభ్రష్ట దృష్టే ర్యథా
యోగో యూపశలాకయోశ్చ గతయోః
పూర్వాపరౌ వారిధీ;
సంసారేఽత్ర తథా నరత్వ మసకృ
ద్దుఃఖ ప్రదే దుర్లభం
లబ్ధే తత్ర చ జన్మ నిర్మలకులం
తత్రాపి ధర్మే మతిః.

[అనగా ఈ ప్రపంచంలో అగాధమైన సముద్రంలో జారిపడిపోయిన రత్నం దొరకడం ఎంత దుర్లభమో, అంధుడికి నిక్షేపం దొరకడం ఎంత అసంభవమో, ఒకటి తూర్పు సముద్రానికీ, రెండోది పడమటి సముద్రానికీ

కొట్టుకో పోయిన యూపమున్నూ శలాకయున్నూ మళ్లా యథాస్థానంలో కలియడమనేది ఎంత దుర్ఘటమో, నిత్యమున్నూ దుఃఖస్థానమైన ఈ ప్రపంచంలో కూడా నిర్మలమైన కులంలో పుట్టడమున్నూ, అందులో కూడా యుక్తసమయాన ధర్మాచరణ బుద్ధి కలగడమున్నూ ఈరెండున్నూ అసంభవమైన విషయాలు. అని భావం.]

తర్వాత రశ్మివేగుడు ప్రజారంజకంగా పరిపాలన చేస్తూ, వకమాటు సిద్ధకూటంలో వుండే జినాలయానికి - వందనానికై పోయి, అక్కడ హరిచంద్రుడనే ముని వుండగా ఆయనవద్ద జైనదీక్షను పుచ్చుకొన్నాడు. ఆ పిమ్మట కొన్నాళ్లకు ఏదో కార్యాంతరాన్ని అడవులకు పోయి అక్కడ ఒక గుహలో దూరి కాయోత్సర్గం ఆరంభించాడు. ఇంతలో శ్రీ భూతిసర్పం నాలుగో నరకానికి పోయి అచ్చట పాపఫలం అనుభవించి కర్మశేషంచేత కొండచిలువై పుట్టి, ఆగుహలో పడి వున్నది. రశ్మివేగుణ్ణి చూడడం తోటే పైనిబడి మ్రింగివేసింది. రశ్మివేగుడు కాపిష్ఠకల్పంలో దేవత్వం చెంది మరికొన్నాళ్లకు ఆ పదవినుండి చ్యుతినిపొంది చక్రపురం రాజైన చక్రాయుధునికి చిత్రమాలాదేవి గర్భాన వజ్రాయుధుడనే కొడుకుగా పుట్టాడు. ఆసర్పం కూడా కాలవశాన మరణించి ప్రియంగుపర్వతంలో భిల్లుడుగా పుట్టాడు. ఇది మూడో జన్మలో వచ్చిన విరోధము.

ఇక నాలుగో జన్మ చెబుతున్నాను. వజ్రాయుధుడు వకమాటు పైనచెప్పిన ప్రియంగు పర్వతంలో కాయోత్సర్గం చేస్తూవుండగా ఆభిల్లుడు నారసంతో కొట్టి చంపినాడు. వజ్రాయుధుడంతట సర్వార్థసిద్ధపదవి పొంది కొన్నాళ్లు పుణ్యఫలం అనుభవించి అది తీరడంతోటే సంజయంతమునిగా పుట్టాడు. వెనుకటి జన్మలో చెప్పిన పూర్ణచంద్రుడివే నీవు. ఆ భిల్లుడున్నూ కాలక్రమేణా మహా నరకాలన్నీ పొంది ఇరావతీ తీరంలో వున్న గోశృంగతాపసుడికి కొడుకుగా పుట్టి, పంచాగ్ని సాధనమనే విద్యను సాధించి, విద్యుద్దంష్ట్రుడుగా ఈ జన్మంలో ఇల్లా ఆవిర్భవించాడు. కాబట్టి ఇది నాలుగు జన్మాలవైరం. ఇక ఈ జన్మంతో ఈబంధం మీ కిద్దఱకూ తెగిపోయింది. కాబట్టి ఈదుష్టుణ్ణి వదలిపెట్టి మీబోంట్లు క్షమాయుధులు కావలిసిందే గాని దమాయుధులు కావచ్చునా?—అని.

దివాకరముని చేసిన ఈ హితబోధను విని సంజయంతుడు సర్వవిధములైన పరీషహాలను మాని, అసాధారణమగు తపస్సుచేసి మోక్షం పొందాడు. దివాకరుడు తన వృత్తాంతం చెప్పుతుండగా విన్న విద్యుద్దంష్ట్రునికి జాతి స్మరత్వం కలిగింది. అంతట అతడు పశ్చాత్తప్తుడై ఆయన కాళ్లమీదబడి వేడికొని జైనదీక్షనుపొంది దుర్ఘటమైన తపస్సుచేసి ముక్తుడైనాడు. కాబట్టి లోకులు శ్రీ భూతి అధోగతినిన్నీ, సింహసేనుడి యూర్ధ్వగతినిన్నీ మననంచేసి, ధర్మశ్రద్ధతో-సత్తపోద్యోతకమును చేసి తరింపవలయునని పెద్దలు చెప్పుచుందురు. ఏ మంటే ఉత్కృష్టమయిన తపోవిభవానికి గల ఫలము అమేయమైందేకదా! కాబట్టే పెద్దలన్నారు:—

శ్లో. అత్యుత్కృష్ట తపో లక్ష్మ్యా
　　భుక్త్వా లక్ష్మీం చ శాశ్వతీమ్,
సంజయంతస్య మాప్నోతు
　　లోకః క్షేమంకరం శుభమ్.

శ్లో. కిం బాహ్యేషు ఫలేషు వస్తుషు మనః
　　కృత్వా వికల్పాన్ బహూన్
రాగద్వేషమయాన్ ముధైవ కురుషే
　　దుఃఖాయ కర్మాశుభమ్;
ఆనందామృతసాగరే యది వస
　　స్యాసాద్య శుద్ధాత్మని,
స్ఫీతం తత్సుఖ మేకతా ముపగతం
　　త్వం యాసిరే నిశ్చితమ్.

ఇది జైనులమత కథలలో ౬ వది సంజయంత మునియొక్క- సత్తపోద్యోతినియను కథ.